రాహుల్ రాధేశ్ శతకం

- హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్ 410 ఆలౌట్

జైపూర్: రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్-బీ మ్యాచ్‌లో రాజస్థాన్‌తో కీలక మ్యాచ్ ఆడుతున్న హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 410 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓవర్ నైట్ స్కోరు 261/5తో రెండో రోజు బ్యాటింగ్‌కు వచ్చిన ఆ జట్టులో వికెట్ కీపర్ రాహుల్ రాధేశ్ (100) శతకంతో మెరవగా లోయరార్డర్ బ్యాటర్లు మిలింద్ (48), తన్మయ్ (22) అతడికి అండగా నిలిచారు. రాజస్థాన్ బౌలర్లలో అజయ్ సింగ్‌కు ఐదు (5/139) వికెట్లు దక్కాయి. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి 117/1 స్కోరు చేసింది.

క్వార్టర్స్‌కు కిరణ్ జార్జి

ఇక్సాన్ (దక్షిణ కొరియా): యువ షట్లర్ కిరణ్ జార్జి కొరియా మాస్టర్స్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీలో క్వార్టర్స్‌కు దూసుకెళ్లాడు. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో కిరణ్.. 21-17, 19-21, 21-17తో చి యు జెన్ (చైనీస్ తైపీ)ను ఓడించాడు. ప్రపంచ 31వ ర్యాంకర్ అయిన జెన్‌ను మట్టికరిపించిన కిరణ్.. క్వార్టర్స్‌లో జపాన్ షట్లర్ టకుమా ఒబయషితో ఢీకొననున్నాడు.

'హైబ్రిడ్' మోడల్‌కు పాక్ ఓకే!

కరాచీ: వచ్చే ఏడాది జరగాల్సి ఉన్న ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో హైబ్రిడ్ మోడల్‌కు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఎట్టకేలకు ఆమోదం తెలిపినట్టు తెలుస్తోంది. ఈ టోర్నీలో పాల్గొనేందుకు పాకిస్థాన్‌కు వెళ్లే ప్రసక్తే లేదని భారత్ తేల్చి చెప్పడంతో హైబ్రిడ్ మోడల్ అనివార్యమైంది. దీంతో టీమ్‌ఇండియా ఆడే మ్యాచ్‌లను యూఏఈ వేదికగా నిర్వహించే అవకాశముంది. చాంపియన్స్ ట్రోఫీకి సంబంధించిన షెడ్యూల్ వచ్చే వారం విడుదలవనున్నట్టు పీసీబీ వర్గాల సమాచారం.

సఫారీలతో సై

నేడు ఇరు జట్ల మధ్య తొలి టీ20 • సత్తాచాటేందుకు కుర్రాళ్లు తహతహ • ప్రపంచకప్ ప్రతీకారం కోసం దక్షిణాఫ్రికా

భారత్, దక్షిణాఫ్రికా మధ్య పొట్టిపోరుకు వేళ యైంది. ఇరు జట్ల మధ్య నేటి నుంచి నాలుగు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు తెరలేవనుంది. ఇటీవల బంగ్లాదేశ్‌పై క్లీన్‌స్వీప్ విజయంతో టీమ్‌ఇండియా మంచి జోరుమీదుంటే..సొంతగడ్డపై సత్తాచాటేందుకు సఫారీలు సై అంటున్నారు. టీ20 ప్రపంచకప్ పరాజయానికి ప్రతీకారం తీర్చుకునేందుకు దక్షిణాఫ్రికా పట్టుదలతో ఉంది. టీమ్‌ఇండియాపై ఆధిపత్యం ప్రదర్శించేందుకు పావులు కదుపుతున్నది. మరోవైపు కుర్రాళ్ల తో కళకళ లాడుతున్న సూర్యకుమార్‌సేన సత్తా చాటాలని చూస్తున్నది. అవకాశాలను అందిపుచ్చుకుంటూ అదరగొట్టేందుకు కుర్రాళ్లు కసిమీదున్నారు. ఇటీవలే సొంత గడ్డపై టెస్టుల్లో కివీస్ చేతిలో ఎదురైన దారుణ పరాభవాన్ని మరిపించేందుకు భారత్ సమిష్టి ప్రదర్శనతో కదంతొక్కనుంది. భారీ స్కోర్లకు వేదికైన డర్బన్‌లో ఇరు జట్ల మధ్య ఆసక్తికర పోరు జరిగే అవకాశముంది.

టీ20 సిరీస్ షెడ్యూల్

తొలి టీ20	నవంబర్ 8
రెండో టీ20	నవంబర్ 10
మూడో టీ20	నవంబర్ 13
నాల్గో టీ20	నవంబర్ 15

డర్బన్: ప్రపంచంలో రెండు అత్యుత్తమ జట్ల మధ్య పొట్టి పోరు అభిమానులను అలరించబోతున్నది. డర్బన్ వేదికగా శుక్రవారం తొలి టీ20 పోరు జరుగనుంది. 2026 సొంత ఇలాఖాలో జరుగనున్న పొట్టి ప్రపంచకప్ నాటికి పటిష్ట జట్టును తీర్చిదిద్దేందుకు టీమ్‌ఇండియా వ్యూహాలు రచిస్తున్నది. ఇందులో భాగంగా సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలో..దేశవాళీ, ఐపీఎల్‌లో మెరుపులు మెరిపిస్తున్న కుర్రాళ్లకు జాతీయ జట్టులో అవకాశం కల్పించింది. అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఇప్పటికే రింకూ సింగ్, అర్ష్‌దీప్‌సింగ్, తిలక్‌వర్మ, రవిబిష్ణోయ్ లాంటి సత్తాచాటుతున్నారు. అయితే రోహిత్ శర్మ, విరాట్‌కోహ్లీ లాంటి దిగ్గజాల వెలితి ఏమాత్రం కనిపించకుండా కుర్రాళ్లు దుమ్మురేపుతున్నారు. బంగ్లాతో చివరి మ్యాచ్‌లో ధనాధన్ సెంచరీతో సీనియర్ బ్యాటర్ సంజూ శాంసన్ ఫామ్‌లోకి రాగా, మరో ఓపెనర్ అభిషేక్‌శర్మ ఫామ్ టీమ్‌మేనేజ్‌మెంట్‌ను ఆందోళన కల్గిస్తున్నది. శాంసన్‌కు తోడు అభిషేక్ టచ్‌లోకి వస్తే..టీమ్‌ఇండియాను ఆపడం సఫారీలకు కష్టమే. వీరికి సీనియర్లు సూర్యకుమార్, హార్దిక్‌పాండ్యా, అక్షర్‌పటేల్ అండగా ఉన్నారు. కెరీర్ మొదట్లో తన దూకుడైన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్న తిలక్‌వర్మ ఈ మధ్య స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చడం లేదు. సఫారీలతో ఈ సిరీస్‌లోనైనా తిలక్ ఫామ్‌లోకి రావాలని అభిమానులు ఆశిస్తున్నారు. బౌలింగ్ విషయానికొస్తే..అర్ష్‌దీప్‌సింగ్ నాయకత్వం వహిస్తుండగా, అవేశ్‌ఖాన్, యశ్ దయాల్, వైశాఖ్ ఇంకా పరిణతి సాధించాల్సి ఉంది.

రా.8.30 నుంచి స్పోర్ట్స్-18లో

సత్తాచాటాలని:

సొంతగడ్డపై పరిస్థితులను అనుకూలంగా మలుచుకుంటూ సత్తాచాటాలని సఫారీలు సిద్ధంగా ఉన్నారు. కెప్టెన్ మార్క్‌రమ్ ఫామ్‌లో లేకపోవడం జట్టుకు లోటుగా కనిపిస్తున్నది. ఈ ఏడాది ఆడిన 14 ఇన్నింగ్స్‌లో మార్క్‌రమ్ ఒకే సారి 25 పరుగుల మార్క్ దాటాడు. దీనికి తోడు ప్రపంచకప్ ఆడిన క్వింటన్‌డికాక్, రబాడ, నోకియా, శంసీ లేకుండా భారత్‌కు ఏమాత్రం పోటీనిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

జట్ల అంచనా

భారత్: శాంసన్, అభిషేక్, సూర్యకుమార్ (కెప్టెన్), తిలక్‌వర్మ, హార్దిక్, రింకూ సింగ్, రమన్‌దీప్‌సింగ్, అక్షర్‌పటేల్, అవేశ్‌ఖాన్, అర్ష్‌దీప్‌సింగ్, వరుణ్ చక్రవర్తి

దక్షిణాఫ్రికా: హెండ్రిక్స్, రికల్టన్, మార్క్‌రమ్(కెప్టెన్), స్టబ్స్, క్లాసెన్, మిల్లర్, జాన్సెన్/కొట్జె, సిమ్లెన్, పీటర్, మహారాజ్, బార్ట్‌మన్.

అర్జున్ @2

ప్రపంచ రెండో ర్యాంకుకు తెలంగాణ గ్రాండ్‌మాస్టర్

చెన్నై మాస్టర్స్ మూడో రౌండ్‌లో విజయం

చెన్నై: గత కొంత కాలంగా సంచలన విజయాలతో 64 గళ్ల ఆటలో సరికొత్త రికార్డులు సృష్టిస్తున్న తెలంగాణ యువ గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి మరో ఘనత సాధించాడు. క్లాసికల్ చెస్ విభాగంలో అతడు ప్రపంచ రెండో ర్యాంకు సాధించాడు. చెన్నై వేదికగా జరుగుతున్న చెన్నై గ్రాండ్ మాస్టర్స్ - 2024లో గురువారం మూడో రౌండ్‌లో అర్జున్.. అలెక్సీ సరన (రష్యా)ను ఓడించడంతో 2వ ర్యాంకుకు దూసుకెళ్లాడు. ఈ టోర్నీలో అర్జున్‌కు ఇది రెండో విజయం. ఈ గెలుపుతో అర్జున్.. 2,805.8 ఎలో రేటింగ్ పాయింట్లు సాధించినట్టైంది. తద్వారా అతడు యూఎస్ఏ ఆటగాళ్లు ఫాబియానో కరానా (2,805), హికారు నకమురా (2,802)ను అధిగమించాడు. నార్వే దిగ్గజం మాగ్నస్ కార్ల్‌సన్ (2,831) అగ్రస్థానంలో నిలిచాడు. ఈ జాబితాలో మరో భారత గ్రాండ్‌మాస్టర్ గుకేశ్ (2,783) ఐదో స్థానంలో ఉన్నాడు. గత నెలలో 2,800 ఎలో రేటింగ్ సాధించిన అర్జున్.. వరుస విజయాలతో అగ్రస్థానం వైపు వడివడిగా అడుగులు వేస్తున్నాడు. ప్రపంచ రెండో ర్యాంకుకు చేరుకున్న అర్జున్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

జురెల్ మెరుపుల్

రాహుల్ మళ్లీ విఫలం

భారత్ 'ఏ' తొలి ఇన్నింగ్స్ 161 ఆలౌట్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా పర్యటన కోసం మిగతా భారత ఆటగాళ్ల కంటే అక్కడికి ముందే వెళ్లిన స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ మరోసారి నిరాశపరిచాడు. తొలి టెస్టులో రోహిత్ స్థానాన్ని భర్తీ చేసేందుకు సెలక్టర్లు అతడిని ఆస్ట్రేలియా 'ఏ'తో జరుగుతున్న రెండో అనధికారిక టెస్టులో ఆడించినా రాహుల్ 4 పరుగులే చేసి నిష్క్రమించాడు. రెండో ఇన్నింగ్స్‌లోనూ ఇదే ప్రదర్శన పునరావృతమైతే బోర్డర్ గవాస్కర్ ట్రోఫీకి రాహుల్ బెంచ్‌కే పరిమితమయ్యే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇక మరో ఓపెనర్ అభిమన్యు ఈశ్వరన్, గత ఇన్నింగ్స్‌లో సెంచరీ చేసిన సాయి సుదర్శన్ డకౌట్ అయ్యారు. కెప్టెన్ రుతురాజ్ (4), దేవ్‌దత్ పడిక్కల్ (26), నితీశ్ రెడ్డి (16) విఫలమైనా వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ (80) జట్టును ఆదుకున్నాడు. కంగారూల బౌలింగ్ దాడిని సమర్థంగా తిప్పికొడుతూ జురెల్ సాధికారిక అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. స్టార్ బ్యాటర్లంతా విఫలమవడంతో మొదటి ఇన్నింగ్స్‌లో భారత్.. 161 పరుగులకు ఆలౌట్ అయింది. మిచెల్ నెసర్(4/27), వెబ్‌స్టర్(3/19) రాణించారు. తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆసీస్.. 17.1 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 53 పరుగులు చేసింది.

సిరీస్ విండీస్ వశం

బార్బడోస్: స్వదేశంలో ఇంగ్లండ్‌తో జరిగిన మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను వెస్టిండీస్ 2-1తో గెలుచుకుంది. బార్బడోస్‌లోని కెన్సింగ్టన్ ఓవల్ వేదికగా బుధవారం ముగిసిన నిర్ణయాత్మక మూడోవన్డేలో విండీస్ 8 వికెట్ల తేడాతో గెలిచింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్.. నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 263 పరుగులు చేసింది. ఫిల్ సాల్ట్ (74), మోస్లీ (57) రాణించారు. ఛేదనను ఆతిథ్య జట్టు 43 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి పూర్తి చేసింది. కీస్ కార్టీ (128), బ్రాండన్ కింగ్ (102) శతకాలతో చెలరేగారు.

స్టార్ క్రికెటర్లతో..

డబ్ల్యూపీఎల్ రిటెన్షన్ జాబితా విడుదల

ముంబై: వచ్చే సీజన్‌లో తాము అట్టిపెట్టుకోబోయే క్రికెటర్ల జాబితాను మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) ఫ్రాంచైజీలు గురువారం విడుదల చేశాయి. ఐదు జట్లు దాదాపు ప్రధాన ఆటగాళ్లనంతా రిటైన్ చేసుకుని గత సీజన్‌లో విఫలమైన క్రికెటర్లను వేలానికి వదిలేశాయి. డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఆరుగురు ఆటగాళ్లను వేలానికి వదిలేయగా ముంబై ఇండియన్స్ స్టార్ బౌలర్ ఇస్సీ వాంగ్‌ను వదులుకోవడం గమనార్హం. ఢిల్లీ క్యాపిటల్స్ బ్యాటర్ లారా హరీస్, లెగ్ స్పిన్నర్ పూనమ్ యాదవ్‌ను రిలీజ్ చేయగా గుజరాత్ జెయింట్స్ తమ మాజీ సారథి స్నేహ్ రాణాను వేలానికి వదిలేసింది. రిటెన్షన్ ముగియగా ఆర్సీబీ వద్ద రూ. 3.25 కోట్లు నగదుండగా ముంబై వద్ద రూ. 2.65 కోట్లు మిగిలాయి. ఢిల్లీ క్యాపిటల్స్ వద్ద అతి తక్కువగా రూ. 2.5 కోట్లు ఉండగా గుజరాత్ వద్ద అత్యధికంగా రూ. 4.4 కోట్లున్నాయి. యూపీ వారియర్స్ పర్స్‌లో రూ. 3.9 కోట్లు మిగిలాయి.

హోరాహోరీగా బ్యాడ్మింటన్ టోర్నీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి:గోపీచంద్ అకాడమీలో ఎన్ఎండీసీ తెలంగాణ ఇంటర్నేషనల్ చాలెంజ్ టోర్నీ పోటీలు హోరీహోరీగా సాగుతున్నాయి. మూడో రోజైన గురువారం జరిగిన పురుషుల సింగిల్స్‌లో లువాంగ్ 21-9, 21-7తో సిద్ధార్థపై గెలిచి ముందంజ వేశాడు. అంతకుముందు టోర్నీని మంత్రి శ్రీధర్‌బాబు అధికారికంగా ప్రారంభించారు. రాబోయే రోజుల్లో తెలంగాణను స్పోర్ట్స్ హబ్‌గా మారుస్తామన్నారు.

విశాఖ తీరాన పీవీ సింధు అకాడమీ

- భూమి పూజకు శ్రీకారం

విశాఖపట్నం: భారత స్టార్ బ్యాడ్మింటన్, రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత అయిన పూసర్ల వెంకట సింధు తన కలల ప్రాజెక్టు అయిన బ్యాడ్మింటన్ అకాడమీ దిశగా తొలి అడుగు వేసింది. 2021లో నాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విశాఖపట్నంలోని తోటగరువు ప్రాంతంలో కేటాయించిన సుమారు మూడెకరాల భూమిలో 'పీవీ సింధు సెంటర్ ఫర్ బ్యాడ్మింటన్ అండ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్'కు భూమిపూజ చేసింది. తన తల్లిదండ్రులతో కలిసి భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించిన సింధు.. అకాడమీకి సంబంధించిన వివరాలను త్వరలోనే వెల్లడిస్తానని తెలిపింది. అకాడమీ నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభించి ఏడాదిలోగా పూర్తిచేస్తామని వెల్లడించింది. అనంతరం ఆమె ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్పందిస్తూ.. 'విశాఖపట్నంలో పీవీ సింధు సెంటర్ ఫర్ బ్యాడ్మింటన్ అండ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్‌కు పునాది పడింది. ఔత్సాహిక క్రీడాకారులకు ఇది సౌకర్యం మాత్రమే కాదు. భారత క్రీడారంగంలో రాబోయే చాంపియన్లను తయారు చేయడానికి తీసుకున్న సాహసోపేత నిర్ణయం' అని రాసుకొచ్చింది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.